క్లుప్తంగా

బ్రాండిక్స్‌లో 300 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 212 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 89 మందికి మందులు అందజేశారు. 25 మందికి కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజన సదుపాయం కల్పించారు. శిబిరానికి విచ్చేసిన వారిని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరామర్శించారు.

రేషన్ డీలర్ల రాయగడ యాత్ర



రాయగడ మజ్జి గౌరమ్మను దర్శించుకుంటున్న రేషన్ డిపో డీలర్లు

మునగపాక : మునగపాక మండల రేషన్ డిపో డీలర్లు ఆదివారం రాయగడ మజ్జి గౌరమ్మను దర్శించుకున్నారు. పిక్నిక్‌లో భాగంగా రేషన్ డిపో డీలర్ల సంఘం అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు నేతృత్వంలో మునగపాక నుంచి ఆదివారం బయలుదేరి ఒడిశాలోని మజ్జి గౌరమ్మను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భోజనాలు చేశారు.

తోటాడలో ఉచిత వైద్య శిబిరం



తోటాడలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మునగపాక : తోటాడ విశాఖ డెయిరీ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అనకాపల్లి కి చెందిన శ్రీనివాసా చిల్డ్రన్స్ అండ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరానికి పరిసర ప్రాంతాల నుంచి 157 మంది రోగులు వచ్చారు. శిబిరానికి వైద్యులు కేఎంజేఎస్ శ్రీనివాస్, సిహెచ్.సందీప్ ఆనంద్ సేవలందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్త లు పాటించాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి శిబిరా న్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రికి చెందిన మేనేజర్ కె.ప్రేమ్, ఆళ్ల గణేష్ పాల్గొన్నారు.

వినాయకుని సన్నిధిలో విజయహోమం



ద్విముఖ కల్యాణ వినాయకుడు

రాంబిల్లి : పంచదార్లలో ద్విముఖ కల్యాణ వినా యకుని సన్నిధిలో మార్చి 3న విజయ హోమం నిర్వ హించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష ల్లో విజయం సాధించి మంచి ఉత్తీర్ణత, మార్కు లు సాధించేందుకు ఈ విజయ హోమం నిర్వ హించనున్నారు. విజయ హోమం అనంతరం విద్యార్థులకు పంపిణీ చేసే పరీక్ష సామాగ్రికి ఆదివారం పూజలు నిర్వహించారు. దిమిలికి చెందిన కె.రామకృష్ణ ఈ పరీక్ష సామాగ్రిని అందజేశారు.

మోదీ పథకాలపై ప్రచారం

రాంబిల్లి : మండలంలో వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మోదీ హయాంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో బీజేపీ నాయకులు శ్రీరామ్మూర్తి, సన్యాసినాయుడు, కారె రాముడు, హనుమంతు పాల్గొన్నారు.

27న మునగపాకలో సామాజిక తనిఖీ

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమం ఈ నెల 27న జరుగుతుందని ఏపీవో ఎరకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరుకావాలని ఎరకయ్య కోరారు.

గొల్ల బాబూరావుకు శుభాకాంక్షల వెల్లువ



రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన గొల్ల బాబూరావును సత్కరిస్తున్న తోట నగేష్



బాబూరావును సత్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

ఎస్.రాయవరం : వెనుకబడిన నియోజకవర్గ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకి రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడం అభినందనీయమని మాజీ గ్రంథాలయ చైర్మన్ తోట నగేష్ అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం తోట నగేష్ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, బొల్లం సూర్యచలపతిరావు, రేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు, పినపోతుల గణేష్, అడవిరాజు ఉన్నారు.

బాబూరావును సత్కరించిన మార్కెట్ కమిటీ చైర్మన్

రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన నియోజకవర్గానికి తొలిసారిగా విచ్చేసిన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుని కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి చంటి, యాదవ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, కొర్ని రాజారమేష్, గుడివాడ యాదవ సంఘ నాయకులు ఉన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి



తాళ్లపాలెం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కశింకోట : విద్యార్థులు విద్యతో పాటు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం కోరారు. తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో ఆదివారం ‘చదవడం మాకిష్టం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆదివారం పాఠశాలలకు సెలవు కావడం అయినందున ఆరోజు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయడం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. గ్రంథాలయంలో అనేక విజ్ఞానదాయకమైన పుస్తకాలు, పత్రికలు, గ్రంథాలు, జీవిత చరిత్రలు అందుబాటులో ఉన్నాయని, వాటిని చదువుకొని విజ్ఞానవంతులు కావాలని కోరారు.

సిద్ధం సభకు సన్నద్ధం

కోటవురట్ల : ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగేందుకు దిశానిర్దేశం చేయనున్నారు. కార్యకర్తలు, నాయకుల్లో సమరోత్సాహం ఉరకలేస్తోంది. సీఎం జగన్ ఇచ్చిన పిలుపునకు మేము సిద్ధమంటూ సై అంటున్నారు. మండలం నుంచి మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణల సారధ్యంలో భారీగా కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు తరలివెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

కోడిపందాలపై కేసు నమోదు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో కోడిపందాలపై దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. స్థానికుల సమాచారంతో గ్రామ శివారులో కోడిపందాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు.

గిరిజనులకు రాచబాట

- కలెక్టరు చొరవతో రహదారి సమస్య పరిష్కారం
- రూ.25 లక్షలతో కొండల్లోంచి పూర్తయిన గ్రావెల్ రోడ్డు



సుందరకోట నుంచి అసనగిరి మధ్య రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు

నాతవరం: కలెక్టరు చొరవతో గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తప్పాయి. రూ.25 లక్షలతో కొండలోంచి కొత్త రోడ్డు వేయడంతో స్వగ్రామంలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా పొందుతున్నారు. దశాబ్దాలుగా తాము పడిన కష్టాలకు వైఎస్సార్‌సీపీ పాలనలో మోక్షం కలగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుందరకోట పంచాయతీ పూర్తిగా దట్టమైన కొండల నడుమ ఉంది. మొదట్లో సరుగుడు పంచాయతీ పరిధిలో శివారు గ్రామంగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేజరు పంచాయతీలు విభజన చేయడంతో సుందరకోట నూతన పంచాయతీగా ఏర్పడింది. ఈ పంచాయతీలో అసనగిరి, శిరిపురం, తోరడ, కొత్త దద్దుగుల, ముంతమామిడిలొద్దు, బమ్మిడికలొద్దు, కొత్త లంకలు శివారు గ్రామాలుగా ఉన్నాయి. ఆయా గ్రామాలన్నీ నాతవరం మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో కొండల మీద ఉన్నాయి. సుందరకోట గ్రామం వరకే రోడ్డు సదుపాయం ఉంది. మిగతా శివారు గ్రామాలకు లేక కొండల మీద నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో సుందరకోట గ్రామాన్ని గతేడాది కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ నుంచి మూడున్నర కిలోమీటర్ల మేర అసనగిరి గ్రామానికి కాలినడకన వెళ్లారు. కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఉండటంతో చలించిపోయారు. గ్రామస్తుల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. గిరిజనుల కోరిక మేరకు రోడ్డు ఏర్పాటు చేస్తానని, తాగునీటి సమస్యతోపాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.2.5 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి టెండర్ల ఖరారు

కలెక్టరు ఇచ్చిన మాట ప్రకారం సుందరకోట నుంచి అసనగిరికి రూ.25 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయించారు. దీన్ని తారురోడ్డుగా మార్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ ప్రాజెక్టు వర్క్స్ ద్వారా రూ.2.5 కోట్లు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే కొత్త లంకలు, కొత్త దద్దుగులు, అసనగిరి, సుందరకోట గ్రామాలకు వాహనాలపై రాకపోకలు సాగించవచ్చు.

అసనగిరిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.28 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల టెండర్లు పూర్తి చేశారు. ఈ వేసవిలో పనులు ప్రారంభిస్తారు. అసనగిరిలో అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం మంజూరు చేశారు. అర్హత కలిగిన వారికి పింఛన్లు, రైతు భరోసా సాయం, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, అటవీ హక్కు పత్రాలు మంజూరు చేశారు. ఆయా పథకాలు అందించేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విశేష కృషి చేశారు. సుందరకోట పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తయి రంగులు వేస్తున్నారు. సంక్షేమ పథకాలు అందించేందుకు సిగ్నల్స్ సమస్య ఉండటంతో కొత్త టవరు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు ఇటీవల స్థలాన్ని పరిశీలించారు.

ఘనంగా అమ్మవార్ల ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: గ్రామ దేవతల ఒడ్డు పండగలు ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కె.జె.పురంలో మోదకొండమ్మ, నూకాంబిక అమ్మవార్ల ఒడ్డు పండగల సందర్భంగా భక్తులు ఘటాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మోదకొండమ్మ, సాగరం, సురవరం, తదితర గ్రామాల భక్తులు ఘటాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

అక్రమ మద్యం కేసులో ఒకరి అరెస్టు

కశింకోట : కన్నూరుపాలెంలో మద్యం సీసాలు తరలిస్తుండగా ఆదివారం ఓ వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ ఎం.రమేష్‌బాబు తెలిపారు. 11 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడు వెంకునాయుడును అరెస్టు చేశామన్నారు.

27న నల్లమారమ్మతల్లి ఉత్సవం

అనకాపల్లి : మండలంలో బీఆర్టీ కాలనీలో ఈనెల 27న శ్రీ నల్లమారమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి కుమార్ రాజా అన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 30 ఏళ్లుగా అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేరోజు అమ్మవారికి తెల్లవారు జామునుంచి కుంకుమ పూజలు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెదిశెట్టి రమేష్, కాండ్రేగుల కిరణ్, రత్నాల ప్రకాష్ పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా శాంతిపార్కు



శాంతిపార్కులో చిన్నారుల సందడి

అనకాపల్లి : స్థానిక శారదానది ఒడ్డున శాంతిపార్కుల చిన్నారులతో ఆదివారం కళాకళలాడింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పార్కును ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పార్కును అభివృద్ధి చేయాలని జీవీఎంసీ రూ.49 లక్షలు, ఎంపీ నిధులు రూ.10 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో పార్కును అభివృద్ధి చేయడంతో పట్టణ పరిధిలో చిన్నారులు, వృద్ధులు, యువకులు పార్కును చూసి ఎంతగానో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జార్జి క్లబ్ అధ్యక్షునిగా జోగినాయుడు



జార్జిక్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం నూతన పాలక వర్గ కమిటీ సభ్యులను క్లబ్ సీనియర్ సభ్యుడు, విశ్రాంతి డీఈవో కె.వీ.గౌరీపతి ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షునిగా బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు, కార్యదర్శిగా బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారిగా వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షునిగా కె.వి.ఎం.వెంకటరావు, సహాయ కార్యదర్శిగా కె.శ్రీనివాసరావుతో పాటు మారో ఆరుగురు పాలక వర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు మాట్లాడుతూ నూతన పాలకవర్గ పై కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా క్లబ్ సభ్యుల సహకారంలో కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

‘నకిలీ గృహ పట్టాలపై విచారణ జరపాలి’

అనకాపల్లి : అచ్చియ్యపేట గ్రామం సమీపంలో సంపతిపురం లేఅవుట్ 2/2లో జరుగుతున్న 303 గృహ నిర్మాణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం, మండల కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న గృహాల్లో అర్హులైన లబ్ధిదారుల పట్టాలను సమగ్రంగా విచారణ జరిపించాలని, అవినీతికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నకిలీ పట్టాలను తయారు చేసి అమ్మడం ద్వారా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయన్నారు.

మెరుగైన ఫలితాలను రాబట్టాలి..



కోటవురట్ల బాలికల హైస్కూల్లో విద్యార్థినులను ప్రశ్నిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కోటవురట్ల : పది ఫలితాలు ఉత్తమంగా వచ్చేందుకు ఉపాధ్యాయులే కీలకపాత్ర పాత్ర వహించాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆయన ఆదివారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకూ పలు సూచనలు చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారు చదివేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరిచి విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించేలా చూడాలన్నారు. విద్యార్థుల ఇళ్లను సందర్శించకుండా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



మునగపాకలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1989–90లో చదువుకున్న విద్యార్థులంతా స్థానికంగా కలుసుకున్నారు. ఉదయం నుంచి ఆట పాటలతో సందడి చేశారు. నాటి తీపి జ్ఞాపకాలను ఒకసారి గుర్తుకు తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. నాడు విద్య నేర్పిన గురువులను గుర్తుకు తెచ్చుకున్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ



కె.వెంకటాపురంలో దివ్యాంగులకు వీల్ చైర్స్ ఇస్తున్న దృశ్యం

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంక్షేమానికి కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీలో దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ ఆదివారం నిర్వహించారు. రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చైర్స్ అందించారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే కాకుండా దివ్యాంగులకు పరికరాలను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో గోవిందరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17న భద్రావతీ సమేత భావనారాయణస్వామి కల్యాణం



భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ దివ్యతేజ

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మార్చి 17న శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి పద్మశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధి డాక్టర్ దివ్యతేజ అన్నారు. స్థానిక వివేకానంద నగర్ దివ్యతేజ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం అమ్మవారి కల్యాణ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి వేలాది మంది పద్మశాలీలు ఈ కల్యాణోత్సవంలో పాల్గొంటారని ఆయన చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పప్పు రాజారావు, అనకాపల్లి సంఘం అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, కోశాధికారి తిప్పన అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా నేతలకు సత్కారం



వరుదు కల్యాణిని సత్కరిస్తున్న జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పెంటకోట జ్యోతి

కశింకోట : వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతిని మహిళా విభాగం నేతలు అభినందించారు. కె.కోటపాడులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి, జిల్లా అధ్యక్షురాలు అనురాధ ఆమెకు దుశ్శాలువా కప్పి అభినందించారు. మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీటిపల్లి లక్ష్మిని కూడా అభినందించారు. ఈ సందర్భంగా జ్యోతి, లక్ష్మి తదితరులు కల్యాణి, అనూరాధలను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. తమకు ఈ పదవులు రావడానికి కారకులైన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నూకాంబిక ఆలయంలో అష్టలక్ష్మి విగ్రహాలు



కశింకోటలోని నూకాంబిక ఆలయంలో ఏర్పాటు చేసిన అష్టలక్ష్మి విగ్రహాలు

కశింకోట : కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రాంగణంలో అష్టలక్ష్మి విగ్రహాలను నూతనంగా నెలకొల్పారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. లక్ష్మీదేవి అష్ట అవతారాలతో ఉన్న ధనలక్ష్మి, ధాన్య లక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితర విగ్రహాలను వరుసగా నెలకొల్పి అందంగా రంగులు వేశారు. ఇవి చూడముచ్చటగా ఉన్నాయి. వీటిని ఆలయానికి వచ్చే భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ భక్తి పారవశ్యం చెందుతున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



కశింకోటలో నూకాంబిక అమ్మవారికి పూజలు

కశింకోట : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వారపు పొద్దు కావడంతో భక్తులు ఎక్కువ మంది దర్శించారు. చీరలు, రవికెలు, తల నీలాలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా పూలమాలలు నూతన వస్త్రాలతో అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. కొందరు తమ ఇళ్ల వద్ద రాత్రి అంతా నూకాంబిక జాగరణ నిర్వహించుకొని బంధువులు, కుటుంబ సభ్యులతో ఊరేగింపుగా అరటి గెలలు, బోనాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో అన్న సమారాధనలు జరిపారు.

స్వయంభూ వరాహలక్ష్మీ నృసింహస్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న రమణమ్మ, తదితరులు

చీడికాడ: అర్జునగిరిలో వెలసిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీ నృసింహస్వామి వారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఇక్కడ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అన్నసమారాధన కార్యక్రమానికి తమ వంతు సహకారంగా సర్పంచ్ బి.రమాదేవి, పెద్దలకు రూ.5 వేలు అందజేశారు. జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, వైఎస్సార్ సీపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో గడ్డివాము దగ్ధం

కె.కోటపాడు: గుల్లేపల్లిలో గడ్డివాము అగ్నికి ఆహుతైంది. ఆదివారం ఇక్కడ రైతు బి.తాతయ్యకు చెందిన గడ్డివాముకు మంటలంటుకుని కాలిపోయింది. తొలుత రైతులు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను అదుపు చేశారు. రూ.20 వేల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.